# 11. ఆస్తి

కేశవరావు పడక కుర్చీలో కూర్చున్నాడు.

వెంకుబాబు, అతడికి ఎదురుగా, దగ్గరగా, కర్ర కుర్చీలో కూర్చున్నాడు.

వెంకుబాబు అలా కూర్చుని, కేశవరావుతో మాట్లాడుతున్నాడు.

'. . నీకు మొగ పిల్లోడునేడు. నుటుకు నుటుకు మంటూ ఆడపిల్ల ఒక్కత్తే వుంది. బాగా సదువుకున్నోడూ, వుద్దోగం వున్నోడూ, ఒవుడూ ఇల్లరికం రాడు. కూతుర్ని ఒగ్గి నువ్వు బతకనేవు. కుద్దిరవయిన కుర్రోణ్ని సూసి, ఇల్లరికం ఎట్టుకో. నువు పండిపోనావు. నానన గూడదు గానీ, నువు ఎప్పుడు కునికేస్తావో, సెప్పనేం! పండి పోయిన పండు రాలి పోకుండా, ఎంత కాలం వుంటాది! రోజులు బాగునేవు! బూవీ- పుట్టా కనిపెట్టుకుండే అల్లుడు కావాలి నీకు! ఒగరొగరు ఒగిసులోనే ఆడపిల్లకి తోడు కుదిరి పోవాలని నాను నీకు సెప్పక్కర్నేదు! మనూరి పూజారి కుర్రోడు కుద్దిర వైన కుర్రోడు! గుమ్మిడి పండు నాగుంటాడు. ! - - కాదూ - బోదూ అంటే- - ఆ దేవుడి గరువు- - ఆ గుంటడి సేతుల్లోకి నడిపెద్దాం! - - ఆ గరువు నారిగోడిది కాదని నీకు తెలుసు, నాకు తెలుసు! అడిగే వోడు నేక - - అది ఆడి సొంత వనుగుంటున్నాడు! నువు నాకు గురువ్వి! - - ఇయ్యాల నాను నీకు గురువు నై పోనానని నువు అనుకోమాక!

- -' అని వెంకు బాబు చెప్పి, నమస్కరించి, వెళ్లిపోయాడు. ఆ వూరి పాత కరణమే గాకుండా, అందరికీ పాత గురువయిన కేశవరావు, అప్పుడు ఏవీ మాట్లాడలేదు.

కేశవరావు పొడవుగా, తెల్లగా, సన్నంగా వుంటాడు. అతడి మీసాలు, అతడి కంటే తెల్లగా వుంటాయి. అతడి జుత్తు , అతడి మీసాల కంటే తెల్లగా వుంటుంది. అతడు నవ్వితే. ఆ నవ్వు– అతడి జుత్తుకంటే తెల్లగా - తెల్ల తెల్లగా వుంటుంది.

పడక కుర్చీలో కూర్చున్న కేశవరావు దిగ్గున లేచి నిలబడ్డాడు. మూలనున్న చేతి కర్రను అందుకున్నాడు. అక్కడే వున్న నల్లని చెప్పుల్ని తొడుక్కున్నాడు. ఆ నల్లని చెప్పుల్లో, తెల్లని పాదాల్ని చూసుకుంటూ, దేవుడి గుడి వేపు వెళ్లాడు. అలా వెళ్లి, దేవుడి గుడినే గాకుండా, ఆ దేవుడి గరువునీ, అలాగే ఆ పూజారి కుర్రాణ్ని కూడా చూసాడు.

ఆ తర్వాత, ఆ నల్లని చెప్పుల్లో, తెల్లని పాదాల్ని చూసుకుంటూ, తెల్లని నవ్వుతో, ఇంటికి తిరిగి వచ్చి, పడక కుర్చీలో కూర్చున్నాడు.

* * *

రాత్రి పన్నెండు గంటలయింది.

ఆ వూరు నిద్ర పోతోంది.

వెంకుబాబు మాత్రం నిద్ర పోలేదు.

అతడప్పుడు ఆకుపచ్చని వెల్గులో నిలువుటద్దం ముందు నిలబడ్డాడు. మీసాల కొనలు పై కెత్తి నిమురుతూ - అద్దంలో చూసుగుంటూ - నిటారుగా నిలబడ్డాడు.

" - - నాను నచ్చాది కార్ననీ ఒవు డైనా కూస్తే సెప్పట్టుకు తంతాను! నాను కోటీసెరుడనని, కోటీసురుడన్నా, నిజంవే అని నిలబడి నాను ఒప్పుగుంటాను! నాలాటోడు కోటీసెరుడవు తాడు గానీ, చచ్చు నచ్చాదికారి కాడుగాక కాడు! మడుసుల్ని పేమించి నోడు- అడుక్కుతింటాడు గానీ- ఆస్తిని పేమించినోడు- ఆకాసాన్ని అవలీలగా అందుకుంటాడు!– –.' అలా వెంకుబాబు ఆకాశాన్ని అందుకుంటూ, తనలో తాను అనుకుంటున్నాడు.

"నువు తొంగే వేటి? – – కునుకు మానేసి, తాగి పిచ్చెక్కి పోతన్నావు! గుండెల్లో మాట గుండెల్లో దాస్తవు గానీ, నాకేటి సెప్పవ్! - - -" అని అతడి భార్య, కూకవేసి, గదిలోకి వెళ్లి పోయింది.

అతడు మళ్లీ తాగి, అద్దం ముందు మీసాలు మెలికలు వేస్తూ నిలబడ్డాడు.

" - - ఆ దేవుడి గరువు- - ఆ మూడెకరాల ముక్కా- - నారిగోడి సేతుల్లో సిక్కుకు పోనాది. ఆ కుసింత ముక్కా - నా వొందెకరాల బూవికీ అడ్డం గుంది! సెందురుడికి మచ్చనా గుంది! మచ్చున్నా సెందురుడు సల్ల సల్లగా బతికేస్తుండు! నా నలా మచ్చతో బతక నేను! నారిగోడు ఆ ముక్కని ఎన్ని చెప్పినా, ఒగ్గటం నేదు! - - నాను కునకటం నేదు! - - ఆ బూవి ఆ గుంటడి సేతుల్లోకి నడిపేస్తే - అది బంతిలా గుండ్రంగా తిరిగొచ్చి నా సేతుల్లో సిక్కుకుంటా ది! బూవి గుండ్రంగా బంతిలా వుంటాదని నాను నమ్ముతాను!" అనివెంకుబాబు, అనుకున్నాడే గానీ, భార్యతో చెప్పలేదు!

❋ ❋ ❋

దేవుడి గుడి ముందు జనం తెగలు తెగలుగా, గుంపులు గుంపులుగా నిలబడ్డారు.

వూరి పెద్ద ముసిలి బాబు, రాతి పలక మీద కూర్చున్నాడు. అతడి కుడి వేపున కేశవరావు కూర్చున్నాడు. ఎడం వేపున వెంకుబాబు కూర్చున్నాడు.

ఎదురుగా నారాయుడు కూర్చున్నాడు.

'నారాయుడూ? అంతా బాగా?- -' ముసిలి బాబు నారాయుణ్ని పలకరించాడు.

'ఏటో బాబూ, ఏటి బాగు? - - ఈతగవా-తీరూ ఏటి!- - ' నారాయుడు వినయంగా అడిగాడు.

'- - నారాయుడూ, ఇటుసూడు! ఈ గుడి శివుడి గుడి. మనూరోళ్లందరూ ఈ దేవుణ్ని

రోజూ మొక్కుతున్నారు. ఈ దేవుణ్ణి రోజూ దర్శిస్తున్నారు. అలాగే పొన్నూరాళ్లెందరెందరో మనూరి దేవుడి దర్శనం కోసం వస్తున్నారు. పట్నాల నుంచి గూడా ఎందరెందరో రోజు రోజూ వస్తూనే వున్నారు. అలా మనూరే ఒక పెద్ద దేవాలయం అయి పోనాది. మనూరు ఎంతో పేరు పొందింది. ఎంతో పెరుగుతోంది. ఇంకా ఎంతో పెరుగు తాది. – –, ముసిలిబాబు, అలా చెప్తూ ఆ పాడు 'తవరు సెప్పింది నిజవే! నానుకాదన్నానేటి?! ' నారాయుడు నెమ్మదిగా అన్నాడు.

ముసిలి బాబు మళ్లీ అందుకున్నాడు.

'- - మనూర్ని మరోలా సూద్దాం! ఈ గుడివల్ల పువ్వులూ- పళ్లూ - కొబ్బరి కాయలూ- అమ్ముకుని ఎంతో మంది బతుకు తున్నారు. అలాగే- సోడాలు- మజ్జిగలూ- టీ కాఫీలు- అమ్ముకుని ఎంతో మంది బతుకుతున్నారు. అంచాత మనం ఇప్పుడు మనూరి అభివృద్ధి కోసం సిన్న సిన్న దుకాణాలు ఎట్టిద్దాం! ఆదివారం సంత ఏర్పాటు సేద్దాం! అలాగే ప్రతి నెలా దేవుడి పండుగ జరిపిద్దాం! అలాగ మనూరోళ్ళకి ఎందరెందరికో బతుకు తెరువు కలుగుద్ది! అలాగ మనూరెంతో ముందుకు పోద్ది! అయితే- - పది మంది కోసం ఒకడు కుసింత కష్టాన్ని కాయాలి! అంచాత నువ్వు కుసింత కష్టాన్ని కాయాలి!

అంచాత - - నారాయుడూ!– – ఈ మూడెకరాల ముక్కా నువు ఒగ్గీక తప్పదు! ఈ బూవి దేవుడి మాన్నెం! నీది కాదు! నీది కాదుకాక కాదు! నీది కాదంటే కాదు! నువు బతకడానికి ఏదో దారి సూపిస్తాం! తుండు గుడ్డ బుర్ర మీద ఏసుకుని - వూరొగ్గేసి నిన్ను పొమ్మంటంనేదు! - - ' అని ముసిలిబాబు, నారాయుణ్ని మూడెకరాల బూవీ వదిలీమని చెప్పాడు.

కూర్చున్న నారాయుడు దిగ్గున లేచి నిబడ్డాడు. నిలబడ్డ నారాయుడు రెండు చేతులు జోడించాడు. రెండు చేతులూ జోడించిన నారాయుడు అందరికీ దండం పెట్టాడు.

' ఈ గరువు ఒవ్వాళ్లదో నాకు తెల్దు! కానీ మా తాతల కాణ్నుంచీ ఈ బూవి దున్నుకు బతుకు తున్నాం . ఈ బూవిలో రాళ్లే గానీ మట్టి నేదని మా తాత నాకు సెప్పేవోడు! ఇయ్యాల ఈ బూవిలోమట్టే గాని, రాల్లు నేవని తవరు సూస్తన్నారు! మా రగతం తావి, రాల్లు మట్టి అయినయ్, బాబూ! ఈ బూవి మా తల్లి! ఈ బూవి మా బతుకు! ఈ బూవిని ఒగ్గేసి మాం బతకనేం! ఈ బూవిని మాం ఒగ్గం! ఈ అగ్గి ఎంకుబాబుగోరెట్టిన అగ్గనీ ఒవురిక తెల్దు, బాబూ! - - ' అని ఆ గరువుని ఒగ్గనని నారాయుడు చెప్పడమే గాకుండా, వెంకుబాబే ఆ అగ్గిని పెట్టాడని కూడా చెప్పాడు.

తగువు తేల్లేదు!

కథ పూర్తి కాలేదు!

అయితే - కేశవరావు కూతురు కోసం మరో సంబంధం చూసుగుంటున్నాడట!

(వివరాలు దొరకరలేదు)